క్లుప్తంగా

బాలికల మదరసా ప్రారంభం



మదరసాను ప్రారంభిస్తున్న సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ

ఉరవకొండ: స్థానిక జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణలో జామీయ మసీదు ఎదురుగా నూతనంగా నిర్మించిన జామీయా తాసీరియా బాలికల మదరసాను ఆదివారం ప్రారంభించారు. సయ్యద్‌తాసీర్‌బాబా పర్యవేక్షణలో నిర్వహించే ఈ మదరాసాను ప్రత్యేక ప్రార్థనల అనంతరం సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, గుత్తి అన్వర్‌బాషా సాహెబ్, కుతుబుద్దీన్ తఖీ బాబా సాహెబ్, షకీబ్‌సాహెబ్ చేతుల మీదుగా ప్రారంభమైంది. సయ్యద్ తాసీర్‌బాబా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా అన్నీ వసతులతో ఉరవకొండలో మొట్టమొదటసారిగా బాలికల మదరసాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మదరసాలో పేద కుటుంబాల బాలికలను 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి కల్పిస్తామన్నారు. అక్టోబర్ 2 నుంచి మదరసాలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బహుజనుల విద్యకు పాటుపడదాం



మాట్లాడుతున్న కుందుర్పి ఎంఈఓ-2 తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: బహుజనుల విద్య కు పాటుపడుదా మని పలువురు వక్తలు అన్నారు. స్థానిక నార్సు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జ్యోతిబా పూలే సత్య శోధక్ సమాజ్ స్థాపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, శ్రీధర్ హాజరై మాట్లాడారు. బహుజనులు ఉన్నత విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు, దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వనదేవతకు పూజలు



చెట్ల కింద సేదదీరుతున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని మాకోడికి గ్రామంలో వర్షం కోసం వనదేవతకు పూజలు నిర్వహించారు. ఆదివారం గ్రామస్తులు ఇళ్లకు తాళాలు వేసి, పెంపుడు జంతువుల సహా సమీపంలోని అడవికి వెళ్లారు. అక్కడ వారు వన దేవతకు పూజలు నిర్వహించారు. చెట్ల కిందే వంట వార్పు నిర్వహించి వన భోజనం చేశారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ప్రవేశించకుండా కంచె వేసి గ్రామ పెద్దలు కాపలా కాశారు. సాయంత్రం గ్రామంలోకి ప్రవేశించారు. ఇలా చేయడం వల్ల వర్షాలు పడి పంటలు సంవృద్ధిగా పండుతాయన్నారు.

చర్చి కార్యదర్శిగా ఆర్థర్‌బాబు

కళ్యాణదుర్గం: పట్టణంలోని సీఅండ్‌ఐజీఎం చర్చి నూతన కార్యదర్శిగా బీఎం ఆర్థర్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చర్చిలో ఆదివారం చర్చి అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ చౌదరి, ఉపాధ్యక్షుడు బంగ్లా ప్రసాద్, సభ్యులు అతడిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, స్త్రీల మైత్రి, యవ్వనస్తుల సంఘం హర్షం వ్యక్తం చేశారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వైఎస్సార్ జలకళ రైతులకు వరం



రైతులకు మోటార్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జలకళ పథకంలో ప్రభుత్వం రైతులకు ఉచితంగా బోరు వేయడంతో పాటు విద్యుత్ సదుపాయం కల్పించి, మోటార్ల పంపిణి చేపట్టిందన్నారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణమంటపంలో ఎర్రగుడి, బెళుగుప్ప, గంవరం, జీడిపల్లి, రామసాగరం గ్రామ రైతులకు తొమ్మిది మోటార్లను ఎస్ఆర్ఈజీఎస్ అధికారులు పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు త్రిలోక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కరుణాకర్, పార్టీ కమిటీ సభ్యురాలు యశోదమ్మ, సర్పంచ్‌లు రత్నమ్మ, రామిరెడ్డి, రమేష్, రుద్రానంద, ఎన్ఆర్ఈజీఎస్ ఎఫ్ఏ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం



అరవ శివప్ప, పట్టణ కన్వీనర్



ఎం వన్నూర్‌స్వామి, డి హీరేహాళ్ కన్వీనర్



హొన్నే మల్లికార్జున, రాయదుర్గం కన్వీనర్



గౌని కాంతారెడ్డి, గుమ్మఘట్ట కన్వీనర్



రామాంజినేయులు, బొమ్మనహాళ్ కన్వీనర్



ఆలూరు చిక్కణ్ణ, కణేకల్లు కన్వీనర్



టీ కేశవరెడ్డి, కణేకల్లు పట్టణ కన్వీనర్

- కమిటీలను ప్రకటించిన విప్ కాపు రామచంద్రారెడ్డి
- మండల కన్వీనర్ల ఎంపికలోనూ సామాజిక న్యాయం
- 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతం అవుతాయని ప్రజల అభిప్రాయం

రాయదుర్గం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహాలకు పదునుపెట్టింది. ఇప్పటికే దిగువస్థాయిలో బూత్‌లెవెల్ వరకూ పలు విభాగాల్లో కన్వీనర్లను నియమించుకున్న పార్టీ నాయకత్వం మండల సారథులు (కన్వీనర్లు) ఎంపికపై దృష్టి పెట్టింది. అనుభవానికి అగ్రతాంబూలం ఇవ్వగా.. సీనియారిటీకి ప్రాధాన్యత పెంచారు. సామాజిక న్యాయంలోనూ పెద్దపీట వేస్తూ క్షేత్రస్థాయి వరకూ పార్టీ మరింత బలోపేతానికి కీలక చర్యలు చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం కన్వీనర్ల జాబితా విడుదల చేశారు.

నూతన కన్వీనర్లు వీరే..

రాయదుర్గం పట్టణ కన్వీనర్‌గా అరవ శివప్ప (నేసే), డి హీరేహాళ్ మండల కన్వీనర్‌గా ఎం.వన్నూర్‌స్వామి (వాల్మీకి), రాయదుర్గం మండల కన్వీనర్‌గా హొన్నే మల్లికార్జున (వీరశైవ లింగాయత్), గుమ్మఘట్ట మండల కన్వీనర్‌గా గౌని కాంతారెడ్డి (రెడ్డి), బొమ్మనహాళ్ మండల కన్వీనర్‌గా రామాంజనేయులు (వాల్మీకి), కణేకల్లు మండల కన్వీనర్‌గా ఆలూరు చిక్కన్న (కురుబ), కణేకల్లు పట్టణ కన్వీనర్‌గా టి.కేశవరెడ్డి (రెడ్డి) సామాజిక వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారు. విప్ సమర్థులను ఎంపిక చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. 2019 ఎన్నికల కంటే దీటుగా 2024 ఎన్నికల్లో ఫలితాలు రాబట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా పాలన వ్యవస్థలో నూతన సంస్కరణలు తీసుకొచ్చి ఎప్పటికప్పుడు ప్రజల్లో తనదైన ముద్ర వేసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త కార్యక్రమాల అమలులోనూ దూసుకుపోతున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆదర్శగా నిలిచారు.

వైఎస్సార్‌సీపీ కంచుకోట

కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా భావిస్తారు. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామస్థాయి వరకూ బలమైన నాయకత్వం ఉండడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఐదు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలన్నీ వైఎస్సార్‌సీపీ ఖాతాకే ప్రజలు చేర్చారు. గత ఎన్నికల కంటే భిన్నంగా వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకే అధికార బాధ్యత కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనేందుకు ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలే నిదర్శనం.

గ్రూపు తగాదాలతో టీడీపీ డీలా..

రాయదుర్గం టీడీపీలో గ్రూపు తగాదాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలే ఇందుకు నిదర్శనం. కాలవ అభ్యర్థిత్వాన్ని సీనియర్లు కొందరు బాహటంగానే వ్యతిరేకిస్తుండడంతో పాటు స్థానికులకే టిక్కెట్టు ఇవ్వాలనే పట్టుదల శ్రేణుల్లో పెరిగినట్టు తెలుస్తోంది. ఈ కారణంగా క్షేత్రస్థాయిలో రెండు గ్రూపులుగా విడిపోయినట్టు చర్చ సాగుతోంది. దీనికి తోడు స్కిల్ స్కాం కేసులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జైలుకెళ్లడంతో యంత్రంగాం మరింత నిస్తేజంలోకి కూరుకుంది. బతిమాలినా రోడ్డెక్కలేని పరిస్థితులు కనిపిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏది ఏమైనా దుర్గం లో వైఎస్సార్‌సీపీ చేపట్టే కార్యక్రమాల ముందు టీడీపీ వచ్చే ఎన్నికల్లో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదని ప్రజల్లో బలమైన చర్చసాగుతోంది.

సమర్థులకే పట్టం



పార్టీకి మూల స్తంభాలుగా చెప్పుకునే మండల కన్వీనర్ల ఎంపికలో సామాజిక న్యాయంతో పాటు సమర్థులను ఎంపిక చేయడంలో అధిష్టానం కీలక భూమిక పోషించింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గాలు చెప్పుకునే వాల్మీకి, కురుబ, నేసే కులాలకు ప్రాధాన్యత కల్పించాం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలోనే కాదు, రాయదుర్గం లో కూడా టీడీపీ పని అయిపోయింది. ఆ పార్టీని ప్రజలే కాదు ఆ పార్టీ నాయకులు కూడా విశ్వశించడం లేదు. – **కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్**

హెడ్ కానిస్టేబుల్‌కు ఘన నివాళి





గోవిందప్ప (ఫైల్), పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని దేవాదుల కొండ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ గోవిందప్ప (51)కు పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. రాప్తాడు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గోవిందప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 23న అనంతపురంలోని ఆస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. 1993లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన గోవిందప్ప శెట్టూరు, తాడిపత్రి, హిందూపురం, రామగిరి, పెనుకొండ, ఇటుకలపల్లి పోలీసు స్టేషన్లలో పనిచేశాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, కుమారుడు ఉన్నారు. కాగా స్వగ్రామం దేవాదుల కొండలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, కళ్యాణదుర్గం, ఇటుకలపల్లి సీఐలు తేజమూర్తి, నరేంద్రరెడ్డి, రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, సరోజ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు గోవిందప్ప మృతదేహానికి నివాళులర్పించారు.

రేపు మండల సమావేశం

రాయదుర్గం రూరల్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య ఆదివారం తెలిపారు. ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠశాలకు ప్రహరీ, గేటు ఏర్పాటు

కూడేరు: సాక్షి కథనంతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతో రాత్రి వేళ మందుబాబులు అక్కడికి చేరి మద్యం సేవించి సీసాలు అక్కడే పడేసి వెళ్లేవారు. ఇతర అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకునేవి. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 27న సాక్షి దినపత్రికలో 'పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు' అనే శీర్షికనతో కథనాన్ని ప్రచురించతమైంది. సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి స్పందించి పంచాయతీ నిధులు సుమారు రూ.1.5 లక్షలతో ప్రహరీ నిర్మించి ఆదివారం గేటు అమర్చారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

'గాంధీ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి'

రాయదుర్గం రూరల్: పట్టణంలోని పాత టవర్ క్లాక్ స్థలంలో గాంధీ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పట్టణంలోని ఆర్యవైశ్యులు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని కోరారు. కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రోగ్రాంలో ఉన్న విప్‌ను ఆర్యవైశ్యులు జయంతి సుబ్రహ్మణ్యం (అప్పి), గోనబావి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, సతీష్, చిందనూరు మహేష్, జయంతి వంశీనాథ్, ఇట్టా గిరీష్, జయంతి విష్ణు ఆదివారం కలిశారు. గత టీడీపీ పాలనలో రోడ్డు విస్తరణ కోసం పట్టణంలోని పాత టవర్ క్లాక్ పక్కనే ఉన్న గాంధీ విగ్రహాన్ని తొలగించారన్నారు. అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో గోనబావి సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యుల సహకారంతో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సహకరించాలని వారు కోరారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు తెలియజేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చేర్‌పర్సన్ కాపు భారతి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి గేట్ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసులు వివరాల మేరకు.. ఆదివారం బచ్చేహళ్లి నుంచి హరీష్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో స్టీల్ కడ్డీలు, వస్తువులను తీసుకుని చెర్లోపల్లికి బయలుదేరాడు. బచ్చేహళ్లి గేట్ వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ హరీష్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గ్రామాల మధ్య సాగునీటి గొడవ

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ, బొల్లనగుడ్డం గ్రామాల రైతుల మధ్య సాగునీటి గొడవ రాజుకుంటోంది. వివరాల మేరకు.. దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 9వ బ్రాంచ్ కాలువ పరిధిలో 10 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. బ్రాంచ్ కాలువ మరమ్మతులను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ గౌడ్ సొంత ఖర్చులతో కాలువ పూడిక తొలగించి పాత డ్రాపును కాదని అందరికీ సమానంగా ఉండేలా డ్రాప్ నిర్మించాడు. నెల రోజుల క్రితం బొల్లనగుడ్డం రైతులు డ్రాప్‌ను పగలకొట్టారు. దీంతో హెచ్చెల్సీ అధికారులు డ్రాప్ నిర్మించి ఇరు గ్రామాల రైతులకు సమానంగా నీరు వెళ్లేలా చేశారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి నీటి ప్రవాహం లేక నీరు సక్రమంగా రాకపోవడంతో అధికారులు నిర్మించిన కాలువను జేసీబీతో తొలగించారు. శనివారం, ఆదివారం రెండు రోజులుగా రెండు గ్రామాల రైతుల మధ్య గొడవకు దారి తీసింది. హెచ్చెల్సీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. హెచ్చెల్సీ జేఈ అల్తాఫ్ తీరుతోనే గ్రామాల మధ్య చిచ్చు రగులుతోందని, రెండు రోజులుగా నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకొని పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

గాయపడిన బాలిక మృతి

రాయదుర్గం రూరల్/రాయదుర్గం టౌన్: ఈనెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలిక మానస(9) బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని మారెమ్మ గుడి ఏరియాకు చెందిన మానస పైతోటకు వెళ్లి రోడ్డు పక్కన నిల్చొని ఉండగా చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన సంతోష్ అనే ద్విచక్రవాహన దారుడు ఢీ కొట్టాడు. బాలిక తలకు బలమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం బాలిక మృతి చెందింది. బాలిక తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ లక్ష్మణ్ణ తెలిపారు.

ఘనంగా వినాయక విగ్రహాల ఊరేగింపు



ఉత్సాహంగా సాగుతున్న వినాయకుని ఊరేగింపు

కణేకల్లు: పట్టణంలో ఆదివారం వినాయక విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. రామనగర్, బస్టాండ్, నేసేపేట కాలనీలో వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి మెయిన్‌రోడ్డులో ఊరేగించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లోని ఆట, పాటలతో యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ డ్యాన్స్‌లు చేసుకొంటూ వినాయకున్ని ఊరేగించి హెచ్చెల్సీ లో నిమజ్జనం చేశారు.

హిందూ మహా గణపతికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మొట్టమొదటిసారిగా కొలువుదీరిన హిందూ మహాగణపతి వినాయక ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 7వ రోజు ఆదివారం మహాగణపతి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 28న నిమజ్జన శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ఉరవకొండ: ప్రైవేట్ పాఠశాలల్లోని సమస్యలతో పాటు యాజమాన్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేలా చొరవ చూపాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలసి ఉరవకొండ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు టి.రాఘురాములు, సభ్యులు షేక్‌బెన్సన్, కిరణ్‌కుమార్ తదితరులు విన్నవించారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్సీకి సమస్యలపై నాయకులు వినతిపత్రం అందించారు.

ఎంపీ నిధులతో ప్రహరీ నిర్మాణం

వజ్రకరూరు: మండలంలోని ఎన్ఎస్‌పీతండా గ్రామంలో ఎంపీ నిధులతో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించారు. శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతుండేవారు. ఈ విషయాన్ని సర్పంచు కవితా బాయి, గ్రామస్తులు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. మాజీ ఎమ్మెల్యే తక్షణమే స్పందించి అనంతపురం ఎంపీ తలారి రంగయ్యతో మాట్లాడి ఎంపీ నిధుల కింద రూ.8 లక్షలు మంజూరు చేయించారు. శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం పూర్తవడంతో ఎంపీ తలారి రంగయ్యకు, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మండల కమిటీ ప్రమాణ స్వీకారం



వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బెళుగుప్ప: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణమంటపంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతన కమిటీ సభ్యులతో కలసి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టపాసులు పేల్చుతూ ర్యాలీగా వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మంటపానికి చేరుకున్నారు. అనంతరం పార్టీ నాయకుడు త్రిలోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ ప్రమాణస్వీరోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మెన్ హరీష్‌యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ పొగాకు రామచంద్ర తదితరులతో కలసి వారు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా విరుపాపల్లికి చెందిన మచ్చన్న, మరో 27 మంది కమిటీ సభ్యులను పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకటించి మాజీ ఎమ్మెల్యే విశ్వతో కలసి సభ్యులతో ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను అప్పగించారు. అలాగే మండల ఉపాధ్యక్షుడిగా బెళుగుప్ప కరుణాకర్, దుద్దేకుంట దేవనాథ్ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా బెళుగుప్ప జె.రామేశ్వరరెడ్డి, బెళుగుప్ప రవీంద్రారెడ్డి, వెంకటాద్రిపల్లి అశోక్, సెక్రటరీలుగా కాలువపల్లి ఫకృద్దీన్, తగ్గుపర్తి నరేంద్ర, గొల్లలదొడ్డి యల్లమ్మ, హెచ్ఆర్‌పల్లి గోపాల్, గుండ్లపల్లి వెంకటరెడ్డి, బెళుగుప్ప తండా తిప్పేస్వామినాయక్, ట్రెజరర్‌గా గంగవరం ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఆవులెన్న వేణుగోపాల్, జీడిపల్లి గంగాధర్, ఎర్రగుడి అంగడి ఎర్రిస్వామి, దుద్దేకుంట హనుమంతరాయుడు, ఎర్రగుడి యశోదమ్మ, బెళుగుప్ప చిన్న దేవమ్మ,శీర్పి శంకర్‌రెడ్డి, కోనాపురం క్రిష్ణా, కోనంపల్లి నాగిరెడ్డి, వీరాంజనేయకొట్టాల భక్తవత్సలం, యలగలవంక మారుతి, నరసాపురం గీత, బూదివర్తి చిత్తప్ప, గంగవరం అంజనమ్మ, యలగలవంక తండా శంకర్ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి, బెస్త, చేనేత కార్పొరేషన్‌ల డైరెక్టర్లు రామాంజనేయులు, రమణ, కోదండరాం, పెన్నహోబిలం దేవస్థానం చైర్మన్ ముత్తులూరి అశోక్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, జెడ్పీటీసీ మమత, జేసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలోనే నంబర్‌వన్ సీఎం జగన్



బొమ్మనహాళ్: లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం రూరల్: విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

బొమ్మనహాళ్: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారతదేశంలోనే నంబర్‌వన్ సీఎంగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఏలంజి గ్రామంలో ఆదివారం అర్హులైన 39 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలకు ఇంటి స్థలాలతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాడానికి ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అర్హత ఉండి లబ్ధిదారుల జాబితాలో పేరులేని వారు ఎవరైనా ఉంటే గ్రామ సచివాయంలో నమోదు చేసుకుంటే స్థలాలు మంజూరు చేస్తామన్నారు. గత టీడీపీ కాలంలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల వద్ద మోకరించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిలేదని, అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. అంతకుముందు దివంగత సర్పంచ్ తిమ్మక్కకు విప్ నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, ఎంపీటీసీ కొత్తురు తిమ్మప్ప, కొలగానహళ్లి సర్పంచ్ శృతి, రైతు విభాగ కన్వీనర్ జి.ఎం నాయుడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, నాయకులు ఈశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, తిప్పయ్య, జయరామ్‌రెడ్డి, వీరన్నగౌడ్, వన్నూరుస్వామి, చిదానంద, అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి భవిత..

రాయదుర్గం రూరల్: యువతే దేశానికి భవిత అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగిన జాతీయ సేవా పథక దినోత్సవంలో ఆయనతో పాటు రెడ్‌క్రాస్ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విప్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. 1969 సెప్టెంబర్ 24న దేశంలోని 37 యూనివర్శిటీల్లో బీకే ఆర్‌వి రావ్ ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారన్నారు. కాపు భారతి మాట్లాడుతూ అపోహలు వీడి ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. శనివారం రక్తదానం చేసిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా విప్‌దంపతులు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేసి సేవాతత్పరతను ప్రోత్సహించారు. అనంతరం జాతీయ సేవాపథక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి , సంరక్షించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విప్ దంపతులు సొంతఖర్చులతో విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించి, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, ఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, గుమ్మఘట్ట నాగేంద్ర, జయంతి విష్ణు, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు రామకృష్ణ, డి.నారాయణ, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండల కేంద్రంలో పీర్ల స్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకూ ప్రధాన రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన డ్రైనేజీ పలు చోట్ల దెబ్బతినడం, సరిగా శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై చేరి అపరిశుభ్రత నెలకొని ఉండేది. పాదచారులు, భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత నెల 28న సాక్షి దినపత్రికలో 'ప్రధాన రహదారిపై మురుగు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా సచివాలయానికి వచ్చిన నిధుల్లో రూ.5 లక్షలతో డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆదివారం డ్రైనేజీ పనులు ప్రారంభించారు. పనులు పూర్తియితే మురుగు సమస్య తప్పనుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



పీర్ల స్వామి గుడి నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ డ్రైనేజీ నిర్మిస్తున్న దృశ్యం